క్లుప్తంగా

హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలి



ఆందోళన చేస్తున్న బీజేపీ నేతలు

సిరిసిల్లటౌన్: నిబంధనలు పాటించకుండా మున్సిపల్ వైస్‌చైర్మన్ నిర్మించిన అక్రమ భవనంపై చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ కోరారు. బుధవారం గోపాల్‌నగర్‌లోని సదరు భవనం వద్ద ఆందోళన చేపట్టి మాట్లాడారు. సిరిసిల్ల మున్సిపల్ వైస్‌చైర్మన్ పట్టణంలోని గోపాల్‌నగర్ ప్రధాన రహదారిపక్కన సెల్లార్‌లో దుకాణాలు నిర్మించాడని, సెప్టిక్‌ట్యాంక్ లేకుండా లేట్రిన్, బాత్రూం నిర్మించారని హైకోర్టులో పిటిషన్ వేసినట్లు తెలిపారు. కోర్టు సెల్లార్‌ను ఓపెన్ చేయాలని, బాత్రూం, లాట్రిన్ తొలగించాలని ఆగస్టు 12న ఆదేశాలివ్వగా సదరు కాపీని ఆగస్టు 27న మున్సిపల్ కమిషనర్‌కు అందించినట్లు పేర్కొన్నారు. కానీ సదరు భవనంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ..నిబంధనలు అతిక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. బీజేపీ ప్రధాన కార్యదర్శి కొండ నరేశ్, చొప్పదండి అంజన్న, రాజు, రమేశ్, శ్రీనివాస్, శివప్రసాద్, సురేశ్ తదితరులున్నారు.

అభివృద్ధిపై కళాజాత

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కళాజాత నిర్వహించారు. ఎడ్మల శ్రీధర్‌రెడ్డి బృందం ఆటపాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. కౌన్సిలర్ అన్నారం శ్రీనివాస్, కళాకారులు శ్రీరాముల రాంచంద్రం, గడ్డం శ్రీనివాస్, గుగ్గిల్ల పర్శరాములు, వంతడ్పుల గణేశ్, తదితరులున్నారు.

కంటి వైద్యశిబిరం



ప్రారంభిస్తున్న ఎస్సై పృథ్వీధర్

బోయినపల్లి: మండలంలోని మల్కాపూర్‌లో కొదురుపాక బీసీఎం కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఎస్సై పృథ్వీధర్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి వైద్యుడు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, జిల్లా యువజన సంఘాల నాయకులు భూంరెడ్డి పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలంలోని దమ్మన్నపేట పీఎంశ్రీ ఆదర్శ పాఠశాలలో బుధవారం కంటి వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య నిపుణుడు ప్రకాశ్, ఫార్మసిస్ట్ పవిత్ర విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రమేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాసేవలో ముందుంటాం



తిరుపతిరెడ్డిని సన్మానిస్తున్న యూత్‌సభ్యులు

వేములవాడరూరల్: ప్రజాసేవ కోసం ఎల్లప్పుడూ తమ కుటుంబం ముందుంటుందని ప్యాక్స్ చైర్మన్, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ ఏనుగు తిరుపతిరెడ్డి అన్నారు. వేములవాడ మున్సిపల్ విలీన గ్రామం శాత్రాజుపల్లి వార్డులో రెడ్డిసంఘం ఆధ్వర్యంలో జిల్లా కేడీసీసీబీ డైరెక్టర్‌గా ఎన్నికైన ఏనుగు తిరుపతిరెడ్డిని బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవలో తమ కుటుంబం ముందుంటుందని, ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. అనంతరం సుభాష్ యూత్ సభ్యులు ఆయనను సన్మానించారు.

విజయవంతం చేయండి



మాట్లాడుతున్న కడారి రాములు

తంగళ్లపల్లి: టెక్స్‌టైల్ పార్కులో సివిల్ సప్లయ్ హమాలీలుగా పనిచేస్తున్న కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. బుధవారం బద్దెనపల్లి–సారంపల్లి టెక్స్‌టైల్ పార్కు సివిల్ సప్లయ్ గోదాముల వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. గురువారం చేపట్టిన చలో కలెక్టరేట్‌ను హమాలీ కార్మికులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీ రేట్లు క్వింటాల్‌కు రూ.26 నుంచి రూ.35 కి పెంచాలన్నారు. జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, పి.రాజేశ్, మల్లయ్య, శివలింగం, బొల్లి దేవయ్య, పుప్పాల దుర్గయ్య, నక్క రాములు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వేములవాడ: పట్టణంలోని బైపాస్‌రోడ్డులో బుధవారం రాత్రి కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన వ్యక్తిని 108లో ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

నిధులున్నా పనులేవి ?

• 17 జీపీ భవనాలకు నాలుగు మాత్రమే పూర్తి • స్థల, ఇతర సమస్యలతో ఆగుతున్న నిర్మాణ పనులు • శిథిల, అద్దె భవనాల్లోనే సిబ్బంది విధులు

కోనరావుపేట: మండలంలోని గ్రామ పంచాయతీ భవనాలకు మోక్షం కలగడంలేదు. భవన నిర్మాణాలకు నిధులు మంజూరుకాగా స్థలాల సమస్యతో పనులు మొదలుకావడం లేదు. కొన్నిగ్రామాల్లో పనులు జరుగుతుండగా, ఇప్పటివరకు పూర్తయిన భవనాల బిల్లులు రావడంలేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. దీంతో జీపీ భవనాల నిర్మాణం అస్తవ్యస్తంగా తయారైంది.

17 జీపీలకు భవనాలు మంజూరు

మండలంలో 21 గ్రామాలున్నాయి.7 నూతన గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి. 17 గ్రామాల్లో పంచాయతీ భవనాలకు ఉపాధిహామీలో ఒక్కో భవనానికి రూ.20లక్షలు మంజూరయ్యాయి. ఇందులో సుద్దాల, కొండాపూర్, రాజన్న గొల్లపల్లి(కొలనూర్)లో భవనాలు పూర్తయ్యాయి. కనగర్తి, మలక్పేట, వట్టిమల్ల, గోవిందరావుపేటతండా, మ రిమడ్ల, మామిడిపల్లిలో పనులు జరుగుతున్నాయి. ఎగ్లాస్‌పూర్‌లో స్థలం లేక పనులు జరగడం లేదు. కొలనూర్, పల్లిమక్తలో పాత భవనాలను కూల్చివేసే పనుల వద్దనే ఆగాయి. కోనరావుపేటలో మరో 30 లక్షలతో అంచనాలు పంపించారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది మండలంలోని కొలనూర్ గ్రామ పంచాయతీ భవనం. కొన్నేళ్ల క్రితం నిర్మించగా శిథిలావస్థకు చేరుకుంది. వర్షాలకు భవనం లోపల ఉరుస్తుంది. నూతన భవన నిర్మాణానికి ఉపాధిహామీ నుంచి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. కొత్త భవనం నిర్మించేందుకు సరిపడా స్థలం లేకపోవడంతో పనులు ముందుకుసాగడం లేదు. దీంతో శిథిల భవనంలోనే బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న స్థలం ధర్మారం గ్రామ పంచాయతీది. నూతన జీపీ భవన నిర్మించేందుకు ఈజీఎస్ నుంచి రూ.23 లక్షలు మంజూరు కాగా, కొత్త భవనానికి స్థలం లేక పాత జీపీ భవనాన్ని కూల్చివేశారు. 2 గుంటల స్థలం అవసరముండగా ఇక్కడ గుంట స్థలం మాత్రమే ఉంది. ఇందుకు అధికారులు అంగీకరించకపోవడంతో మొదటి అంతస్తు నిర్మించేందుకు అంచనాలు వేసి కలెక్టర్, ఈఈకి దరఖాస్తు చేశారు. వారి నుంచి అనుమతి రాక అద్దెభవనంలో విధులు నిర్వర్తిస్తున్నారు



ఈ ఫొటోలో కనిపిస్తుంది రాజన్న గొల్లపల్లి(కొలనూర్) గ్రామపంచాయతీ భవనం. ఈ భవన నిర్మాణానికి ఉపాధి హామీ నుంచి రూ.20 లక్షలు మంజూరు కాగా పనులను గత అక్టోబర్ వరకు పూర్తిచేశారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గత డిసెంబర్ 31న ప్రారంభించారు. అయితే ఈ పనులు చేసిన కాంట్రాక్టర్‌కు బిల్లు అందలేదు. కొండాపూర్, సుద్దాల గ్రామాల్లో నిర్మించిన భవనాలకు కూడా బిల్లు రాలేదు.

బిల్లులో జాప్యం



రాజన్న గొల్లపల్లిలో జీపీ భవనం లేకపోవడంతో పాఠశాల వంటగదిలో విధులు నిర్వర్తించారు. నూతన భవనం మంజూరుకావడంతో నిర్మించేందుకు ఎవరూ ముందుకురాకపోవడంతో అప్పులు చేసి భవనం నిర్మించా. అధికారులు స్పందించి బిల్లులు త్వరగా మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలి. – బొజ్జం మల్లేశం, రాజన్నగొల్లపల్లి

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం



గత ప్రభుత్వ హయాంలో పలుగ్రామాల్లో నూతన భవనాలు మంజూరయ్యాయి. అదే సమయంలో పనులు మొదలయ్యాయి. భవన నిర్మాణ పనులు పూర్తిగా జరిగిన గ్రామాల్లో ఇప్పటివరకు బిల్లులు రాలేదని తమ దృష్టికొచ్చింది. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లి బిల్లులు మంజూరయ్యేలా చూస్తాం. –షేక్ ఫిరోజ్‌పాషా, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

చందుర్తి: జిల్లాలోని స్వశక్తి సంఘాల మహిళలు ఆర్థిక సాధికారత సాధించేందుకు ఇందిరా మహిళా శ క్తి పథకాన్ని ప్రభుత్వం అమలుచేస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని జోగాపూర్, మర్రిగడ్డలో ఇందిరా మహిళ శక్తిలో భాగంగా అందజేస్తున్న సూక్ష్మ రుణాల మంజూరుతో ఏర్పాటు చేసిన టెంట్‌హౌస్, బ్యూటీషియన్, సెంటర్, ఈవెంట్ మెన్మెజ్‌మెంట్ సెంటర్, మర్రిగడ్డలో గిఫ్ట్ ఆర్టికల్ దుకాణాన్ని బుధవారం ప్రారంభించారు. జిల్లాలకు సీఎం రేవంత్‌రెడ్డి రూ.600 కోట్లు కేటాయించారని,మహిళలు ఈరుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో పీడీ శేషాద్రి, అడిషనల్ పీడీ శ్రీనివాస్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుధారాణి, పద్మయ్య ఐకేపీ ఏపీఎం రజిత, సీసీ వనజ, శ్రీనివాస్, రాంచద్రం, శ్రీకాంత్, శశికాంత్, పార్టీ మండల అధ్యక్షులు రామస్వామి పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు..అండగా ఉంటాం

వర్షాలతో నష్టపోయిన బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మర్రిగడ్డకు నేరెల్ల సరోజనకు, మల్యాల రాజేశంకు రూ.50వేల చొప్పున చెక్కులను బాధితులకు అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, పార్టీ మండల అధ్యక్షుడు రామస్వామి, నాయకులు గొట్టే ప్రభాకర్, నేతికుంట జలపతి, పాల్గొన్నారు.



పాఠశాల సందర్శన

మల్యాల ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా సందర్శించారు. పాఠశాలలో వసతులపై అడిగి తెలుసుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రామస్వామి, పులి సత్తయ్య తదితరులున్నారు.

మూలవాగు పరివాహక ప్రాంతాల పరిశీలన



మూలవాగు ప్రవాహాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లి, వట్టిమల్ల, కొండాపూర్ మూలవాగు పరివాహక ప్రాంతాలను బుధవారం బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరిశీలించారు. భారీ వర్షాలకు నిమ్మపల్లి, వట్టిమల్ల, కొండాపూర్ వాగులు పొంగిపొర్లడంతో పలుచోట్ల కట్టలు తెగి రాకపోకలకు ఇబ్బంది తలెత్తడంతో జలమయమైన ప్రాంతాలను పరిశీలించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మూలవాగు అనుసంధానంగా ఉన్న పలు గ్రామాలకు రోడ్లు వేయించాలని జీవో తీసుకొస్తే ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జీవోను రద్దు చేయించడంతో ఇలాంటి సమస్య నెలకొందన్నారు. వెంటనే మూలవాగుకు అనుసంధానమైన రోడ్లను వేయాలని ఆయన డిమాండ్ చేశారు. సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దేవయ్య, సీనియర్ నాయకులు రాఘవరెడ్డి, కదిరె శ్రీనివాస్, దొంతరవేని శ్రీనివాస్ గౌడ్, ప్రభాకర్‌రావు, మాజీ ఎంపీపీ చంద్రయ్య గౌడ్, గోగు ప్రతాపరెడ్డి, ప్రవీణ్, మోహన్, శివతేజ, తదితరులు ఉన్నారు.

గురుకులాలపై ప్రభుత్వం చిన్నచూపు



మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

ఎల్లారెడ్డిపేట: గత ప్రభుత్వం గురుకులం పాఠశాలలను బలోపేతం చేస్తే కాంగ్రెస్ చిన్నచూపు చూస్తుందని బీఆర్ఎస్వీ మండల అధ్యక్షులు కొర్రి అనిల్, జుబేర్ అన్నారు. మండలకేంద్రంలో బుధవారం వారు మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వం సుమారు 6వేల మందిని తొలగించిందన్నారు. గురుకులాలను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. గురుకులాల్లో పూర్తిస్థాయిలో ప్యాకల్టీని నియమించాలని లేకపోతే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. సమావేశంలో సురేశ్, పవన్, నాగరాజు, దినేశ్, తిరుపతి, సీత్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇళ్లు

చందుర్తి: మండలంలోని బండపల్లికి చెందిన కుమ్మరి చిరంజీవికి చెందిన ఇల్లు వర్షానికి కూలిపోయింది. గోడ కూలిన శబ్దం రావడంతో కుటుంబ సభ్యులతో బయటకు వచ్చారు. ఇంట్లో ఉన్న సామగ్రి తడిసి పోకుండా కాపాడుకునేందుకు ఇంటిపై టార్పాలిన్ కవర్‌ను వేశారు.

తంగళ్లపల్లి: బస్వాపూర్‌కు చెందిన గొడిసెల తిరుపతి పెంకుటిల్లు ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోగా అధికారులు, కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. తహసీల్దార్ జయంత్‌కుమార్ కూలిన ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, పూర్మాని రాం లింగారెడ్డి, బైరినేని రాము, శ్రీనివాస్, ఎగుర్ల ప్రశాంత్, మధుకర్ (భోటు), బీఆర్ఎస్ నాయకుడు ఎల్లయ్య తదితరులున్నారు.

తెనుగువానిపల్లెలో ..

ఇల్లంతకుంట: మండలంలోని వంతడుపుల గ్రామ పంచాయతీ ఆమ్లెట్ గ్రామమైన తెనుగువాని పల్లెలో నాయిని నర్సయ్యకు చెందిన ఇల్లు కూలిపోయింది. బుధవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి అరుణకుమారి సందర్శించారు.

మట్టి వినాయకుల తయారీ

గంభీరావుపేట: గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం మట్టి వినాయకులు తయారు చేశారు. మట్టి వినాయకుల వినియోగం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు జల కాలుష్యం తగ్గుతుందని అధ్యాపకులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి. విజయలక్ష్మీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ధర్మపురి, అకాడమిక్ కోఆర్డినేటర్ ప్రభాకర్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ ఆంజనేయులు, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో ఆర్డినేటర్ వాణి, టాస్క్ కో ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● **వడ్డీ వ్యాపారిపై పోలీసులకు ఫిర్యాదు**

కోనరావుపేట: మండల కేంద్రంలో వడ్డీ వ్యాపారం చేస్తున్న వ్యక్తిపై కోనరావుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి తెలిపిన వివరాలు. కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన భీమనపెల్లి ప్రభాకర్ అదే గ్రామానికి చెందిన దండుగుల వెంకటేశ్ రెండేళ్ల క్రితం అతని భార్య కమ్మలు తాకట్టు పెట్టి రూ.3వేలు అప్పుగా తీసుకున్నాడు. రెండేళ్ల తర్వాత డబ్బులు తిరిగి ఇవ్వడానికి వెళ్లగా కమ్మలు లేవంటూ సదరు వ్యాపారి వెళ్లగొట్టాడు. డబ్బులు తీసుకుని తన భార్య కమ్మలు ఇవ్వాలని వేడుకున్నా వినలేదు. దీంతో బాధితుడు భీమనపెల్లి ప్రభాకర్‌పై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని గడ్డం రవీందర్ రెడ్డికి చెందిన దూడెను గుర్తుతెలియని వ్యక్తులు చంపివేశారని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పశువైద్యాధికారులు పరిశీలించారన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

● **నషా ముక్తి భారత్ అభియాన్ కావాలి**

ఎల్లారెడ్డిపేట: చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని, నషా ముక్త్ భారత్ నిర్మించాలని బ్రహ్మ కుమారి మనీషా కోరారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. పొగ తాగడం ద్వారా 13 రకాల క్యాన్సర్లు వస్తాయన్నారు. మద్యం సేవిస్తే కాలేయం, క్లోమం దెబ్బ తింటాయని, డ్రగ్స్ తీసుకోవడం ద్వారా మానసిక ఆరోగ్యం పాడవుతుందన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ మెడిటేషన్ చేయాలని కోరారు. బ్రహ్మకుమారి సేవా సంస్థ సభ్యులు పుష్ప, శ్రేష్ఠ, సారిక, విశ్వ, లక్ష్మణ్, శివానంద్, శంకర్, కాలేజీ స్టాఫ్ పాల్గొన్నారు.

● **రహదారి మరమ్మతు**

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లి శివారులో వంతెన వద్ద రోడ్డు కోతకు గురికావడంతో సిరికొండ, మరిమడ్ల–నిమ్మపల్లి, సిరిసిల్ల ప్రాంతాలకు రవాణా వ్యవస్థ నిలిచిపోయింది. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా ఆధ్వర్యంలో వంతెన వద్ద బుధవారం మరమ్మతు పనులు చేపట్టారు. కోతకు గురైన ప్రాంతంలో మొరం, మట్టిని నింపి రవాణాను పునరుద్ధరింపజేశారు.

● **ఎర్రకుంట కట్టకు బుంగ**

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని ఎర్రకుంట కట్టకు బుంగ పడి నీరంతా వృథాగా వెళ్తోంది. మంగళవారం ఇరిగేషన్ అధికారులు పరిశీలించి గ్రామ పంచాయతీ సిబ్బంది సాయంతో తూం వద్ద ఇసుక సంచులు వేశారు. అయినా నీరే అలాగే వెళ్తోంది. దీనిపై నీటి పారుదల శాఖ డీఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా గురువారం మరమ్మతులు చేపడుతామని పేర్కొన్నారు.

● **చేసిన సేవలతోనే గుర్తింపు**

వేములవాడఅర్బన్: ఉపాధ్యాయులు చేసిన సేవలే గుర్తింపునిస్తాయని జిల్లా విద్యాధికారి రమేశ్ అన్నారు. పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు జనపాల వెంకటయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వెంకటయ్య దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి బన్నాజీ, ఉపాధ్యాయులు యాదగిరి, రవీందర్‌రావు, కృష్ణ, హరికృష్ణ, తదితరులు ఉన్నారు.

● **రైతులు ఆందోళన చెందొద్దు**

బోయినపల్లి: అర్హులైన రైతులకు రుణమాఫీ వరిస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని వేములవాడ డివిజన్ ఏడీఏ రామారావు పేర్కొన్నారు. మండలంలోని కొత్తపేట, మాన్వాడ, మల్లాపూర్ గ్రామాల్లో ఎంఏవో ప్రణీత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతుల సర్వేను బుధవారం పరిశీలించారు. ప్రభుత్వం అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ చేస్తుందన్నారు. ఎంఏవో కే.ప్రణీతరెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో 557 మంది రైతులు రేషన్‌కార్డు లేనివారు ఉన్నారని తెలిపారు.



వేములవాడరూరల్: గ్రామాల్లో ఉపాధి హామీ కింద చేసిన పనుల వివరాలను ప్రజలకు తెలిసేలా ఆ శాఖ అధికారులు బోర్డులు ఏర్పాటు చేస్తారు. కానీ మండల పరిషత్ కార్యాలయంలో రాయించిన ఈ బోర్డులు మాత్రం కార్యాలయ ఆవరణలోనే నిరుపయోగంగా వదిలేశారు. గ్రామాలకు తరలించాల్సిన ఈ బోర్డులను అధికారులు పట్టించుకోకపోవడంతో నిర్లక్ష్యంగా మూలకు పడేశారు.

సంప్రదించాల్సిన అధికారి : మల్లయ్య, ఎంపీవో, వేములవాడరూరల్, ఫోన్: 9121209699

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9440243048, 9705346626

ఇద్దరికి జైలు, జరిమానా

సిరిసిల్లకల్చరల్: వివిధ కేసుల్లో నిందితులకు జిల్లా న్యాయస్థానం జైలు శిక్ష విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించింది. ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బతుకమ్మ కుంటకు చెందిన వెంకట్‌వాడ్ మారుతి, ఇందిరానగర్‌కు చెందిన మండల సాయికుమార్ పట్టణంలోని మల్లికార్జున, కార్తికేయ మద్యం దుకాణాల్లో గతేడాది ఫిబ్రవరి 13న దొంగతనాలకు పాల్పడ్డారు. పట్టణంలోని సాయినగర్‌కు చెందిన చవహాన్ దత్తు నాయక్ ఇంటిముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురికాగా అదేరోజు ఉలిచె ప్రశాంత్ ఇంట్లో చోరీ జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు చోరీకి పాల్పడ్డ ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ నిందితులు మారుతి, సాయికుమార్‌లకు ఏడాది పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

వాహనం చోరీ కేసులో..

2014 ఫిబ్రవరి 6న దెగావత్ చంద్రుకు చెందిన బైక్ చోరీకి గురైంది. దీనిపై ఫిర్యాదు చేయగా పోలీసులు గంభీరావుపేటకు చెందిన అంకం రాజును అరెస్ట్ చేసి ఏడునెలల జైలు శిక్ష విధించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సందీప్ ఎస్సై రవీంద్రనాయుడు, కోర్టు కానిస్టేబుల్ నరేశ్‌ను ఎస్పీ అభినందించారు.

వేములవాడ సమాచారం



వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి సన్నిధిలో బుధవారం అంతంతమాత్రంగానే భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం 5 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	04	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	25	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	05	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	03	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	12	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	28	560
నందీశ్వర సూట్స్	04	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	38	448
పార్వతీపురం స్పెషల్	18	672
పార్వతీపురం సాధారణ	30	336

- వేములవాడ

బీఆర్ఎస్ నేతలపై దాడులు సరికాదు



మాట్లాడుతున్న రవిగౌడ్

సిరిసిల్లటౌన్: వరద బాధితులను కలిసి సాయం చేసేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు దాడులు చేయడం సరికాదని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం పట్టణంలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రతిపక్ష పార్టీ ఎత్తిచూపితే అప్రజాస్వామిక చర్యలకు పాల్పడటం దురదృష్టకరమన్నారు. వరదల్లో నష్టపోయిన బాధితులు, రైతులను ప్రభుత్వం వెంటనే అన్నివిధాలా ఆదుకోవాలన్నారు. నాయకులు మట్టె శ్రీనివాస్, కోడం వెంకటేశ్, సాయి, కోడి రోహిత్, నవీన్, శ్రావణ్, సాయి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

సింగసముద్రం నుంచి నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న అధికారులు, రైతులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్ శివారులోని సింగసముద్రం నుంచి జక్కుల చెరువులోకి బుధవారం రైతులు, అధికారులు నీటిని విడుదల చేశారు. మూడు రోజులుగా మత్తడి దూకుతోంది. అదే విధంగా సింగసముద్రంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. జక్కుల చెరువులోకి వచ్చే తూము గెట్లను పైకి ఎత్తారు. సింగసముద్రం ఆయకట్టు 2200 ఎకరాలు ఉండగా, జక్కుల చెరువు ఆయకట్టు 300 ఎకరాలు ఉంది. ఈ రెండు చెరువులు నిండితే 2,500 ఎకరాలు సాగులోకి వస్తాయి.

కరెంట్‌షాక్‌తో 13 గొర్రెలు మృతి



ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్‌లో కరెంట్ షాక్‌తో 13 గొర్రెలు చనిపోయాయి. బాధితుని కథనం ప్రకారం.. ఆవునూర్‌కు చెందిన బత్తుల మల్లేశం యాదవ్ తన గొర్రెల మందను ఆరుబయట ఇనుప కంచెల మధ్య మంగళవారం రాత్రి ఉంచాడు. బుధవారం ఉదయం గొర్రెల అరుపులతో బయటకొచ్చిన మల్లేశం మృతిచెందిన గొర్రెలను చూసి బోరున విలపించాడు. అయితే, ఇనుప కంచెకు విద్యుత్ సరఫరా కావడం గమనించి మెయిన్‌ను బంద్ చేశాడు. అప్పటికే 13 గొర్రెలు మృతి చెందడంతో రూ.లక్షన్నర వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదిలా ఉండగా.. మల్లేశం తల్లి తీవ్ర అనారోగ్యంతో ఉండగా.. ఆమె మంచంలో అచేతన పరిస్థితిలో ఉంది. ఆమెకు ప్రత్యేక ఆక్సిజన్ సిలిండర్ పెట్టి అందిస్తున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

టీడీఎఫ్ రూ.10వేల అందజేత

గొర్రెలు మృతి చెంది, తల్లి అచేతన స్థితిలో ఉన్న మల్లేశం కుటుంబానికి అండగా ఉంటామని తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం జాతీయ అధ్యక్షుడు మట్ట రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బాధితుడికి టీడీఎఫ్ పక్షాన రూ.10వేలు అందించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల కో కన్వీనర్ కనమేని చక్రధర్‌రెడ్డి తెలిపారు. బాధిత కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి బాధితున్ని పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మాజీ జెడ్పీటీసీ గుండం నర్సయ్య, వేణు తదితరులు ఉన్నారు.

● **కాంగ్రెస్ నాయకుల పూజలు**

ముస్తాబాద్: ముస్తాబాద్ పెద్ద చెరువు మత్తడిదూకగా కాంగ్రెస్ నాయకులు గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. మత్తడి వద్ద సంబురాలు నిర్వహించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రాజు, మాజీ సర్పంచ్ తిరుపతి, రాజేశం, ప్రతాప్ రెడ్డి, ధర్మేందర్, భూమరాజం, తదితరులున్నారు.